సాక్షి గుంటూరు

గురువారం । 4 । సెప్టెంబర్ । 2025



వైభవంగా గణపతి కల్యాణం

నగరంపాలెం: స్థానిక మారుతీనగర్ శ్రీకంచి కామకోటి పీఠం శ్రీమారుతి దేవాలయ ప్రాంగణంలో బుధవారం శ్రీసిద్ధిబుద్ధి సమేత శ్రీవరసిద్ధి గణపతి కల్యాణం ఘనంగా జరిగింది.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: ఎగువ నుంచి 35,879 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 21000 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుతం 40.1642 టీఎంసీలు నిల్వ ఉంది.



హుండీ కానుకల లెక్కింపు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): స్థానిక వాల్మీకోద్భవ వేంకటేశ్వర స్వామి హుండీ కానుకల ద్వారా రూ. 30.51 లక్షల ఆదాయం వచ్చిందని ఈవో సాంబశివరావు తెలిపారు.

న్యూస్‌రీల్

వైభవంగా నృసింహుని పవిత్రోత్సవాలు



మంగళగిరి: మంగళాద్రిలో వేంచేసివున్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారి పవిత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజు బుధవారం ఉదయం గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం హోమాలు జరిగాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను ఈవో సునీల్‌కుమార్ పర్యవేక్షించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు.

పశ్చిమ డెల్టాకు 6,830 క్యూసెక్కులు విడుదల




దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి 6,830 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కి 296, బ్యాంక్ కెనాల్‌కు 1,748 క్యూసెక్కులు, తూర్పు కాలువకు 598, పశ్చిమ కాలువకు 204, నిజాపట్నం కాలువకు 200, కొమ్మూరు కాలువకు 3,120, బ్యారేజీ నుంచి సముద్రంలోకి 60,150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

యువతకు ప్రేరణాత్మక సందేశం



గుంటూరు మెడికల్: సర్వేపల్లి రాధాకృష్ణ మనవడు ఎ. సుబ్రహ్మణ్య శర్మ బుధవారం నగరానికి విచ్చేశారు. డాక్టర్ శనక్కాయల అరుణ, ఎ.కృష్ణారావుల నివాసానికి బుధవారం వచ్చి యువతతో ఆత్మీయంగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన 'ఇండియా ఈజ్ ఇన్ యువర్ హార్ట్' అనే ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు. దేశభక్తి, క్రమశిక్షణ, కృషి ద్వారానే యువత తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉదయశంకర్, రాధా మాధవి, ఉమా శంకర్, రాజకుమారి పాల్గొన్నారు. ఆత్మీయ ఆతిథ్యంతో అల్పాహారం ఏర్పాటు చేశారు. స్థానిక యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహాగణపతికి ప్రత్యేక పూజలు



గుంటూరు రూరల్: నగర శివారు ఇన్నర్ రింగ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన 99 అడుగుల మట్టి మహాగణపతికి శ్రీశైల దేవస్థానం నుంచి తెచ్చిన 36 అడుగుల వరి కంకుల గజమాలను బుధవారం అలంకరణ చేశారు. సింగంశెట్టి సుబ్బారావు దంపతులు వరి కంకుల గజమాలను తెచ్చి స్వామివారికి అలంకరింపజేశారు. సౌత్ డీఎస్పీ భానోదయ బుధవారం స్వామి వారిని దర్శించుకుని, పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ నరేంద్ర, వైస్ చైర్మన్ రాజానాయుడు, సెక్రటరీ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ అన్నదాన ట్రస్ట్‌కు రూ.10 లక్షల విరాళం



తిరుమల: టీటీడీ నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్‌కు గుంటూరు జిల్లాకు చెందిన భక్తుడు ఆలపాటి సురేష్ రూ.10,11,111 విరాళంగా అందించారు. దీనికి సంబంధించిన డీడీని బుధవారం సాయంత్రం తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి స్వయంగా అందజేశారు.

జ్వరం సలసల.. జనం విలవిల

కూటమి సర్కార్ నిర్లక్ష్యంతో అల్లాడుతున్న జిల్లా ప్రజలు

> “ గుంటూరు రూరల్ మండలం గోరంట్లకు చెందిన రాంబాబు ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వెళితే వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. వైద్యులు పలు రకాల పరీక్షలు, చికిత్స పేరుతో రూ. 20వేలకు పైగా బిల్లు వేశారు. రోజువారి కూలి పనులు చేసుకుంటూ జీవించే రాంబాబు కొద్దిపాటి జ్వరానికి రూ. 20 వేలు కట్టలేక నానా ఇబ్బందులు పడ్డారు. ”

> “ బాపట్ల జిల్లాకు చెందిన జి.శ్రీనివాసులు జ్వరంతో బాధపడుతూ స్థానిక ఆర్ఎంపీని సంప్రదించారు. నాలుగు రోజులపాటు ఆర్ఎంపీ చికిత్స చేసినా తగ్గకపోవడంతో గుంటూరుకు రిఫర్ చేశారు. గుంటూరు ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యులు టీబీగా, ఇన్‌ఫెక్షన్‌గా నిర్ధారించి రూ. 2 లక్షలకుపైగా బిల్లు వేయడంతో శ్రీనివాసులు కుటుంబ సభ్యులు కంగుతిన్నారు.'' ”



వైద్య పరీక్షల కోసం జీజీహెచ్‌కు వచ్చిన రోగులు

వణికిపోతున్నారు ...

జిల్లా ప్రజానీకం చిన్నా, పెద్ద తేడా లేకుండా కొద్దిరోజులుగా జ్వరాలతో వణికిపోతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స కోసం వెళితే వైద్యులు అందుబాటులో ఉండటం లేదు. దీంతో వారు ప్రైవేటు ఆసుపత్రులను సంప్రదించి ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. ముఖ్యంగా డెంగీ పేరుతో ప్రైవేటు వైద్యులు రూ. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. వ్యాధులను కట్టడి చేయాల్సిన వైద్య అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు మిన్నకుండి పోతున్నారు. రోగులు ఆసుపత్రులకు వెళ్లి ఇబ్బంది పడుతున్నా ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో లేకపోయినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

- మాయదారి రోగాలతో మంచం పడుతున్న జిల్లా ప్రజలు
- డెంగీ జ్వరానికి చికిత్స పేరుతో ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీ
- వ్యాధులను కట్టడి చేయడంలో వైద్యాధికారులు విఫలం

సాక్షి ప్రతినిధి, గుంటూరు, గుంటూరు మెడికల్: జిల్లాను జ్వరాలు వణికిస్తున్నాయి. తురకపాలెంలో అంతుచిక్కని రోగంతో ప్రజలు పిట్టల్లా రాలుతున్నారు. అటు కూటమి పాలకులు, ఇటు జిల్లా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పేదల ఆరోగ్యం అంటే కనీసం లెక్కలేకుండా పోతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పలు ఆసుపత్రులలో నాడి పట్టి చూసే దిక్కు కూడా లేదు. ప్రయివేటు ఆస్పత్రులకు వెళితే రూ. లక్షల్లో బిల్లులు వేసి అందినకాడికి గుంజుకుంటున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

అంతుచిక్కని వ్యాధితో బెంబేలు

గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో అంతుచిక్కని జ్వరం ప్రజలను అల్లాడిస్తోంది. మెలియాయిడోసిస్ జ్వరంగా కొంత మంది వైద్యులు నిర్ధారించారు. ఈ వ్యాధి సోకితే ప్రాణాలు పోతున్నాయి. రెండు నెలల వ్యవధిలో సుమారు 25 మంది చనిపోయినట్లు గ్రామస్తులు వాపోతున్నారు. ఎన్నడూ లేని విధంగా గ్రామంలో అత్యధిక సంఖ్యలో జ్వర పీడితులు ఉండటం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. గ్రామస్తులంతా నూతన రకం జ్వరంతో భయాందోళనలు చెందుతున్నా వైద్య అధికారులు ఇప్పటి వరకు వ్యాధికి గల కారణాలు నిర్ధారించలేదు. వారి భయాలు తొలగిపోయేలా ఎలాంటి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. కొద్దిరోజులుగా మీడియాలో గ్రామంలో నెలకొన్న భయాలపై కథనాలు ప్రచురితం కావడంతో మంగళవారం నామమాత్రంగా ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

తూతూ మంత్రంగా చర్యలు

జిల్లా వైద్య అధికారులు జూన్, జూలై నెలల్లో డెంగీ, మలేరియా అవగాహన మాసోత్సవాల పేరుతో ఒకటి రెండు రోజులు ర్యాలీలు చేసి మిన్నకుండిపోయారు. కేవలం పట్టణాల్లోనే ఒకటి, రెండు రోజులు ప్రచార ఆర్భాటాలు ఉంటున్నాయి తప్ప, గ్రామస్థాయిలో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఏమాత్రం జరగడం లేదు. ఫ్రైడే డ్రైడే పేరుతో వారంలో ఒక్కరోజు వైద్య సిబ్బంది హడావుడి చేయడం తప్ప, నిజంగా జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలను అప్రమత్తం చేస్తున్న దాఖలాలు లేవు. దోమల నియంత్రణలో భాగంగా చేసే ఫాగింగ్, ఇతర కార్యక్రమాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. నిధులు ఖర్చు తప్ప, వ్యాధుల కట్టడి లేదు. జ్వరాలు వచ్చిన వెంటనే గతంలో ప్రత్యేకంగా ఫీవర్ సర్వే నిర్వహించి, వ్యాధులు పెరగకుండా కట్టడి చేసేవారు. నేడు ఫీవర్ సర్వే అటకెక్కింది. టెలీ మెడిసిన్ పేరుతో గతంలో అన్ని రకాల వ్యాధులకు ముఖ్యంగా ఫీవర్‌లకు ఫోన్‌లో సమాచారం అందజేసి మందులు సైతం వైద్య సిబ్బంది ద్వారా ఇంటికి పంపించేవారు. నేడు టెలీ మెడిసిన్ వైద్యం ఊసేలేదు. వ్యాధుల పట్ల అవగాహన కల్పించి రోగులకు ధైర్యాన్ని కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఫీవర్ సర్వే, టెలీ మెడిసిన్ కార్యక్రమాలు నేడు కనుమరుగయ్యాయి.



జీజీహెచ్‌లో మలేరియా జ్వరం పరీక్షలు చేయించుకుంటున్న రోగులు

గుంటూరు నగరంలోనే ఎక్కువ కేసులు

జిల్లాలో ఈ సీజన్‌లో ఇప్పటివరకు డెంగీ 60, మలేరియా 2, చికున్‌గున్యా 14 కేసులు నమోదయ్యాయి. గుంటూరు నగరంలో పట్టాభిపురం, అరండల్‌పేట, ఎన్టీఆర్ స్టేడియం, లాలాపేట, చౌత్రా సెంటర్, ఎన్టీఆర్ నగర్, ఎన్జీవో కాలనీ, యాదవబజారు, నల్లచెరువు, శారదాకాలనీ, అమరావతి రోడ్డు, గుంటూరువారి తోట, లాలాపేట, మంత్రివారి బజారు, గుండారావు పేట, ఎల్ఆర్ నగర్, తదితర ప్రాంతాల్లో 33 కేసులు నమోదయ్యాయి. కేవలం గుంటూరు నగరంలోనే 33 డెంగీ కేసులు నమోదవడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరంలోనే కేసుల తీవ్రత ఇలా ఉంటే గ్రామాల్లో ఏ విధంగా ఉందో ఊహించుకోవచ్చు. చాలా మంది ప్రజలు జ్వరాలతో మంచం ఎక్కారు. పలువురు ప్రభుత్వ వైద్యులు అందుబాటులో లేక ఆర్ఎంపీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సీజనల్ వ్యాధులను కట్టడి చేయాల్సిన వైద్య అధికారులు చోద్యం చూస్తున్నారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోకుండా మిన్నకుండి పోవడం వల్లే జ్వరాల కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఫీవర్ సర్వే చేయిస్తున్నాం

జిల్లాలో కొద్దిరోజులుగా జ్వరాల కేసులు నమోదవుతున్న దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ఫీవర్ సర్వే చేయిస్తున్నాం. దోమల నియంత్రణ కోసం ఫాగింగ్, ఇతర అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రత్యేక జ్వరాలతో ఆందోళన చెందుతున్న తురకపాలెంలో స్పెషాలిటీ వైద్యులను ప్రత్యేక బృందాలుగా తీసుకెళ్లి వైద్య శిబిరం నిర్వహించాం. రక్తపు నమూనాలు సేకరించాం. మూడు రోజుల అనంతరం ఆ రిపోర్టులు వస్తాయి. దాన్ని బట్టి పూర్తి స్థాయి వైద్య సేవలు అందిస్తాం.

– డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

శాంతించిన కృష్ణమ్మ

ఊపిరి పీల్చుకుంటున్న రైతులు

కొల్లూరు: కృష్ణా నదీ తీర గ్రామాల ప్రజలు, రైతులను భయాందోళనలకు గురి చేసిన కృష్ణమ్మ ఎట్టకేలకు శాంతించింది. నెల రోజుల నుంచి నదిలో నిండుగా నీరు ప్రవహించింది. వరద ఉద్ధృతి తగ్గుముఖం పట్టడంతో బుధవారం నీటి మట్టం కూడా అడుగంటడం మొదలెట్టింది. ప్రకాశం బ్యారేజ్ నుంచి సముద్రంలోకి నీటి విడుదలను ఆ శాఖాధికారులు తగ్గించడంతో రైతులను వరద భయం వీడింది. ఎగువనున్న శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టుల నుంచి కూడా నీటి విడుదల నిలిచిపోయింది. మున్నేరు తదితర వాగుల నుంచి వస్తున్న స్వల్ప మొత్తంలో నీరు ప్రకాశం బ్యారేజ్ నుంచి దిగువకు విడుదలవుతోంది. బుధవారం ఉదయం 1.73 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదలవగా, క్రమంగా అధికారులు తగ్గించారు. సాయంత్రానికి 36 వేల క్యూసెక్కులకు పరిమితమైంది.



పెసర్లంక అరవింద వారధి వద్ద తగ్గిన నీటి మట్టం

యథాతథంగా రాకపోకలు

వరద తీవ్రత తగ్గిన కారణంగా మండలంలోని దోనేపూడి కరకట్ట దిగువున పోతార్లంక మార్గంలో లోలెవల్ వంతెన పైనుంచి రాకపోకలు యథథావిధిగా జరుగుతున్నాయి. ఇన్నాళ్లు వరద భయంతో ఆందోళనకు గురైన పరీవాహక ప్రాంత రైతులు కృష్ణమ్మ శాంతించడంతో ఊపిరి పీల్చుకుంటున్నారు.

మహిళల ఆర్థిక వృద్ధికి సహకారం

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: ప్రతి కుటుంబంలో ఒక మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందితే కుటుంబంతోపాటు సమాజానికి కూడా మేలు చేకూరుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, డీఆర్‌డీఏ, వెలుగు శాఖల సమన్వయ వర్క్‌షాపు నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యుల అవసరాల కోసం ఎప్పుడు కావాలంటే అప్పుడు వెసులుబాట్లు కల్పించాలని బ్యాంకు మేనేజర్లకు తెలిపారు. డీఆర్‌డీఏ సిబ్బంది సంఘాల నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో సుమారు 20 వేల సంఘాల్లో 2 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని కలెక్టర్ గుర్తు చేశారు. ప్రతి సంఘం సుమారు రూ.8.50 కోట్లు రుణాలు పొందుతూ నూటికి 99 శాతం తిరిగి చెల్లించడం విశేషమన్నారు. మహిళల ఆర్థిక క్రమశిక్షణకు ఇది ఉదాహరణ అన్నారు. యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా వీరిని ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో 5,700 మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

డీఆర్‌డీఏ పీడీ పి.వి.విజయలక్ష్మి మాట్లాడుతూ... 2025–26 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 74,966 మంది స్వయం సహాయక సంఘ సభ్యులు, రూ. 876.41 కోట్ల రుణాలు కుటుంబ పెట్టుబడి ప్రణాళికను తయారు చేశారన్నారు. సమావేశంలో ఏపీ గ్రామీణబ్యాంకు చైర్మన్ ఎ.ప్రమోద్‌కుమార్ రెడ్డి, ఎస్‌బీఐ డీజీఎం కృష్ణకుమార్ ప్రభు, యూనియన్ బ్యాంకు డీజీఎం జవహర్, లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది మంది ఉపాధ్యాయులకు రాష్ట్ర పురస్కారాలు

ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఎంపికైన గురువులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి తొమ్మిది మంది ఎంపికయ్యా రు. బుధవారం పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన ఈ జాబితాలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి ముగ్గురేసి చొప్పున ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ఈ నెల 5వ తేదీన రాష్ట్ర స్థాయి గురుపూజోత్సవంలో వీరికి పురస్కారాలను ప్రదానం చేయనున్నారు.

- గుంటూరు బ్రాడీపేటలోని శ్రీశారదానికేతన్ ఓరియెంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయురాలు పి.సునీత రజని, రవీంద్రనగర్‌లోని పట్టాభిపురం నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జి.సుశీల మాధవి, చేబ్రోలు మండలం చీలిపాలెం ఎంపీపీ మోడల్ స్కూల్ ఎస్టీటీ డాక్టర్ అవ్వారి భద్రావతి పురస్కారాలకు ఎంపికయ్యారు.
- పల్నాడుజిల్లా నుంచి నకరికల్లు జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయురాలు బి.శివకుమారి, శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ గ్రేడ్–2 హెచ్ఎం ఎం.పార్వతి, నూజెండ్లమండలం బీపీఆర్‌కనపర్రు ఎంపీపీ స్కూల్ ఎస్జీటీ వై.రాజ్యలక్ష్మిలు ఈ అవార్డు పొందనున్నారు.
- బాపట్ల జిల్లా అద్దంకిలోని తిమ్మయ్యపాలెం జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ జె.ప్రతాప్, సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం జెడ్పీ హైస్కూల్ బయాలజీ ఉపాధ్యాయురాలు కె.మోహనాంజలి, అద్దంకిలోని ఎంపీయూపీ పాఠశాల ఎస్జీటీ ఎం. ధనలక్ష్మిలు పురస్కారం స్వీకరించనున్నారు.

గుంటూరు జేసీగా అశుతోష్ శ్రీవత్స



గుంటూరు వెస్ట్: గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా అశుతోష్ శ్రీవత్సను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. 2021 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన ఇప్పటి వరకు వెయిటింగ్‌లో ఉన్నారు. గుంటూరు జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎ.భార్గవ్‌తేజను జీఏడీకి రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు వెలువడ్డాయి.

డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి

నగరంపాలెం: ఏపీలో పలు రేంజ్‌లలోని ఎనిమిది మంది సీఐలకు డీఎస్పీలుగా ఉద్యోగోన్నతులుగా కల్పిస్తూ రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా గుంటూరు రేంజ్‌లోని సీఐలు ఎం.వెంకట సుబ్బారావు, కె.వెంకటేశ్వర్లు, బెల్లం శ్రీనివాసరావు, సీహెచ్ చంద్రమౌళిలకు డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి లభించింది.

16 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ముగ్గురిపై పాత గుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారంతో సీతానగర్ రెండో వీధి పీడీఎస్ దుకాణం నుంచి తరలి వెళ్తున్న రేషన్ బియ్యం టాటా ఏసీ ఆటోను బుధవారం పరమయ్యకుంట వద్ద పట్టుకున్నారు. అందులో 16 క్వింటాళ్ల బియ్యం బస్తాలను గుర్తించారు. కోళ్ల మేతకు ఉపయోగించేందుకు ఈ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ మేరకు దుకాణం నిర్వాహకుడు దాసరి శ్రీను, ఆటో యజమాని చంద్రశేఖర్‌రెడ్డి, పల్నాడు జిల్లా నకరికల్లు గుండ్లపల్లికి చెందిన షేక్ అలీపై కేసు నమోదు చేశారు. దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరించాలి

జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గ్రామ స్థాయి నుంచి ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పథకంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రకృతి సాగు విస్తరణకు జిల్లా, మండల స్థాయిలలో విభాగాల సమన్వయ సమావేశాలు జరుగుతాయన్నారు. ప్రచార దశలో ప్రతి గ్రామంలోనూ సమావేశాలు, మోడల్ ప్రదర్శనలు నిర్వహించాలని ఆదేశించారు. నమోదు దశలో గ్రామంలోని అన్ని కుటుంబాల వార్షిక వ్యవసాయ ప్రణాళికలు తయారు చేసి రైతులను సహజ వ్యవసాయంలోకి తీసుకొస్తారని తెలిపారు. ఈ మొత్తం ప్రక్రియ ఈ నెలాఖరుకు పూర్తి చేసి.. రానున్న రబీ సీజన్‌కు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. రైతులందరినీ అనుబంధ శాఖల అధికారులతో సమన్వయం చేసి ప్రకృతి వ్యవసాయ అభివృద్ధికి దోహదపడాలన్నారు. జిల్లా ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 21,957 మంది రైతులు 26,083 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. జిల్లాలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పథకాన్ని మరో 77 గ్రామాలకు విస్తరించారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, ఏపీసీఎన్ఎఫ్ జిల్లా యాంకర్ గోపీచంద్, డీహెచ్ఓ నరేంద్ర కుమార్, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఛత్ర' గణపతి



స్థానిక ఏటుకూరురోడ్డు శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద 27వ గణేష్ చతుర్థి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం, సహస్ర నామార్చన నిర్వహించారు. స్వామి వారు ఛత్ర గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ జరిగింది. కార్యక్రమంలో వాసవీ యూత్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల నాగేశ్వరరావు, కార్యదర్శి పువ్వాడ నాగ వెంకట నారాయణ, కోశాధికారి కాజా శ్యాంసుందర్, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ అన్నారామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

–నగరంపాలెం (గుంటూరు వెస్ట్)

'పచ్చ' పైత్యం... రోడ్డుకు అడ్డంగా ముళ్ల కంపలు



రెండు రోడ్లపై ముళ్లకంపను అడ్డువేసిన దృశ్యం

రెంటచింతల: పల్నాడు జిల్లా రెంటచింతల మండలంలోని తుమ్మకోట గ్రామంలో నున్న రెండు రహదారులపై టీడీపీ వర్గీయులు ముళ్ల కంపవేసి రాకపోకలను అడ్డుకుంటున్నారు. గ్రామంలోని జంగాలవారి వీధిలోని హనుమాన్ ఆలయం సమీపంలో ఆదివారం టీడీపీకి చెందిన ఓ వ్యక్తి నా స్థలం.. నా ఇష్టం అంటూ గ్రామస్తులు నడిచే రెండు రహదారులపై ముళ్లకంప వేసి అడ్డుకున్నాడు. వెంటనే ఆ కాలనీకి చెందిన కొందరు గ్రామ వీఆర్ఓ నరసింహ, గ్రామ సర్వేయర్ శివేంద్రకు సమాచారం ఇవ్వగా.. వారు ఇద్దరూ వెళ్లి సర్వే చేసి.. ముళ్ల కంపలు తీయకపోగా.. తాము కార్యదర్శికి చెపుతామని మీరు ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లాలని చెప్పినట్లు తెలిపారు. ఈ రహదారి వేసిన స్థలం 1988లో అడ్డుకున్న వ్యక్తి తాత వద్ద నుంచి ఆ ప్రాంతానికి చెందిన వారు రూ.4 వేలకు కొనుగోలు చేసి రహదారి ఏర్పాటు చేసినట్లు స్థానికులు తెలిపారు. దీనిపై ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసరావును సంప్రదించగా.. గురువారం సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,000 గరిష్ఠం : రూ. 2,800

మోడల్ ధర రూ. 2,400



పసుపు ధరలు

(బుధవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 639

కొమ్ములు : 398 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,600	10,851	10,485

కాయలు : 241 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,600	10,650	10,250

మొత్తం అమ్మకాలు : 479.25 క్వింటాళ్లు

–దుగ్గిరాల

క్లుప్తంగా

ఇంటర్ బోధనేతర సంఘ కార్యవర్గం ఎన్నిక



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ఇంటర్మీడియెట్ బోధనేతర సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన చేబ్రోలు శ్యాం బాబు, బి.గోపీకృష్ణలు బుధవారం ఇంటర్మీడియెట్ విద్య ఆర్జేడీ జె.పద్మను కలిశారు. సాంబశివపేటలోని ఆర్జేడీ కార్యాలయంలో సంఘ నూతన కార్యవర్గానికి ఆర్జేడీ అభినందనలు తెలిపారు. అనంతరం ఆర్‌ఐవో జి. సునీతను నూతన కార్యవర్గ ప్రతినిధులు కలిశారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు పి.సాయి శివకుమార్, సంయుక్త కార్యదర్శి సీహెచ్ రాజు, కోశాధికారి డి. రామారావు, మహిళా కార్యదర్శి జె.హిమబిందు, కార్యనిర్వాహక కార్యదర్శి పి.ప్రభు ద్యాని, కార్యనిర్వాహక సభ్యుడు పి.నారాయణ, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చలపతిరావు మృతికి సంతాపం

నగరంపాలెం: ఉమ్మడి ఏపీ పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన కంచర్లపల్లి వెంకటచలపతి రావు బుధవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో మృతి చెందారు. ఈ మేరకు ఏపీ పోలీస్ అధికారుల సంఘం జిల్లా మాజీ కార్యదర్శి ఆకుల అశోక్‌కుమార్, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి దళవాయి సుబ్రహ్మణ్యం, జిల్లా అసోసియేషన్ సభ్యులు లక్ష్మయ్య, జేవీ, బేబీరాణి, షేక్ హుస్సేన్, అంకుశం సాంబశివరావులు బుధవారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- విద్యార్థులకు మంత్రి గుమ్మడి సంధ్యారాణి సూచన
- ఘనంగా గురుకుల పాఠశాలల రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



ఏఎన్‌యూలో క్రీడాకారుల నుంచి క్రీడావందనం స్వీకరిస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

పెదకాకాని(ఏఎన్‌యూ): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బుధవారం ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల రాష్ట్రస్థాయి 4వ స్పోర్ట్స్‌మీట్–2025 ఘనంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథులుగా మంత్రి సంధ్యారాణి, ప్రిన్సిపల్ సెక్రటరీ, గవర్నమెంట్ ట్రైబల్ వెల్ఫేర్ వైస్ చైర్మన్ ఎం. మల్లికార్జుననాయక్, ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ సదా భార్గవి, గురుకులం సెక్రటరీ గౌతమి, వర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ పాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆడాలని ఆలోచన వచ్చిందంటేనే పిల్లలు గెలిచినట్టన్నారు. రోజూ గంటకుపైగా ఆడుకోవడం ద్వారా శారీరక సామర్థ్యం పెరుగుతుందన్నారు. గురుకులం సెక్రటరీ గౌతమి మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి 5వ తేది వరకు బాలికలు, 7 నుంచి 9వ తేదీ వరకూ బాలురకు 12 అంశాల్లో క్రీడలు ఉంటాయని చెప్పారు. 13 జిల్లాల నుంచి 656 మంది హాజరు అవుతున్నారని పేర్కొన్నారు. మంత్రి సంధ్యారాణి విద్యార్థుల నుంచి క్రీడావందనం స్వీకరించారు.

వసతులు కరువు

1500 మంది క్రీడాకారులతో నిర్వహించడానికి అనుకూలంగా వసతులు లేని కారణంగా బాలికలు, బాలురకు వేర్వేరు తేదీల్లో క్రీడాపోటీలు నిర్వహించాలని నిర్ణయించారు. వర్సిటీలో అథ్లెటిక్స్, బాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్, తైక్వాండో, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్, షూటింగ్, స్విమ్మింగ్ విభాగాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ ఆఫీసర్ శ్యాంసుందర్ వివరించారు. ముందుగా జాతీయ జెండా, స్పోర్ట్స్ జెండా, ఈఎంఆర్‌ఎస్ జెండాలు ఆవిష్కరించారు. అనంతరం మంత్రి సంధ్యారాణి 800 మీటర్ల పరుగుపందెం పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ ఆచార్య కె. గంగాధరరావు, రిజిస్ట్రార్ సింహాచలం, పలువురు స్పోర్ట్స్ అధికారులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం



జ్యోతి ప్రజ్వలన వేడుకలో ఐజీ ఆకే రవికృష్ణ తదితరులు



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

- విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలి
- ఈగల్ టీమ్ ఐజీ ఆకే రవికృష్ణ

తాడేపల్లి రూరల్: 'డ్రగ్స్ వద్దు బ్రో.. చదువే ముద్దు బ్రో' అనే నినాదంతో విద్యార్థులు మత్తుపదార్థాలను తరిమికొట్టాలని ఏపీ ఈగల్ టీమ్ ఐజీ ఆకే రవికృష్ణ పిలుపునిచ్చారు. 'డ్రగ్స్ వినియోగం వలన కలిగే నష్టాల'పై మండలంలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ యూనివర్సిటీలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రవికృష్ణ మాట్లాడుతూ ఇప్పుడు మాదక ద్రవ్యాలు వినియోగం వల్ల జీవితాలు నాశనం అవుతాయన్నారు. యువతలో మాదకద్రవ్యాల అలవాటు పెద్ద సవాలుగా మారిందన్నారు. మొదట స్నేహితుల ఒత్తిడి లేదా ఆసక్తితో మొదలై తర్వాత బానిసలుగా మారి జీవితాన్ని పూర్తిగా నాశనం చేసేకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకసారి ఈ చీకటి లోకంలోకి అడుగు పెడితే బయటకు రావడం చాలా కష్టమని తెలిపారు. సమస్యను అధిగమించే దిశగా పయనిస్తూ మాదకద్రవ్యాలను అరికడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ టి.రవికుమార్, డీన్ ప్రసాద్, రిజిస్ట్రార్ సుబ్బారావు, డీఎస్పీ సింగయ్య, సీఐ విక్టర్, ఎస్‌ఐ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి యార్డులో ముఠా కార్మికుల ధర్నా

- కూలి రేట్లు పెంచాలని డిమాండ్
- జేసీ అధ్యక్షతన సమావేశంలో పెంపు

నగరంపాలెం: కూలి ధరలు పెంచాలంటూ ముఠా కార్మికులు బుధవారం గుంటూరు మిర్చి యార్డు ఆవరణలో ధర్నా చేపట్టారు. తాము ఇబ్బందులకు గురవుతున్నామంటూ ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన అత్యవసర సమావేశానికి జాయింట్ కలెక్టర్ (జేసీ), పర్సన్ ఇన్‌చార్జి ఎ.భార్గవ్ తేజ అధ్యక్షత వహించారు. కార్మికుల డిమాండ్లను పరిశీలించారు. యాజమాన్యాలు కూలి ధరలు పెంచేందుకు అంగీకరించాయి. దీంతో ముఠా కార్మికులు సంతోషం వ్యక్తం చేసి, జేసీకి కృతజ్ఞతలు తెలిపారు. కూలి ధరలను రెండేళ్లకు ఒకసారి పెంచుతున్నామని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు. అంగీకరించిన ధరల ప్రకారం దిగుమతి కూలి టిక్కీకి రూ.8.80, కొట్టు కాపలా కూలి టిక్కీకి రూ.8.92, కొట్టు ముఠా మిర్చి బస్తా కోయడం, ప్రదర్శించడం, కుట్టుట, కాటా వేయడం టిక్కీకి రూ.13.50 గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

8న ఎరువుల కొరతపై ధర్నా

లక్ష్మీపురం: ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టి, రైతాంగానికి సక్రమంగా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8వ తేదీన సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాలలో జరిగే ధర్నాలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. గుంటూరు కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలోని మల్లయ్యలింగం భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా యూరియా, డీఏపీ వంటి ఎరువులు అందక రైతులు నెల రోజులుగా గగ్గోలు పెడుతున్నారన్నారు. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే వారి పార్టీ కార్యకర్తలకు మాత్రమే యూరియా ఇస్తున్నారని ఆరోపించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 4న అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలతో సమావేశం ఉంటుందని తెలిపారు. చండీఘర్ మహాసభలో వివిధ అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా, నగర కార్యదర్శులు కోట మాల్యాద్రి, అరుణ్‌కుమార్‌లు మాట్లాడుతూ గుంటూరు మిర్చియార్డులో కూలి రేట్లు పెంచాలని ముఠా కార్మికులు చేపట్టిన ఆందోళనకు మద్దతు ఇచ్చారు. నగరంలో ట్రాఫిక్, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక



ఉప్పల చెంచయ్య



కూసం రమేష్

ఇంకొల్లు (చినగంజాం): మండలానికి చెందిన ఇద్దరిని జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పేర్ని సత్యనారాయణ, షేక్ మస్తాన్ వలి బుధవారం తెలియజేశారు. ఏఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్సు ఉపాధ్యాయుడు ఉప్పల చెంచయ్య, నాగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్సు ఉపాధ్యాయుడు కూసం రమేష్ ఎంపికయ్యారని తెలిపారు. వీరిని ఈ నెల 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టర్, జిల్లా విద్యా శాఖ అధికారి ఆధ్వర్యంలో సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. యూటీఎఫ్ మండల కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

అద్దంకి రూరల్‌లో..

అద్దంకి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డీఎస్ పద్మావతి, తిమ్మాపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు రంగిశెట్టి శ్రీనివాసరావు, చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు బొడ్డు చిన అంకారావు, మోదేపల్లి ప్రాథమిక పాఠశాల ఎస్‌జీటీ యు.రాజశేఖర్‌లు అవార్డుకు ఎంపికైనట్లు ఎంఈఓ కేవీ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రీతి తల్లిదండ్రులపై జనసేన నేత వ్యాఖ్యలు దారుణం

- ప్రీతి తల్లి కోరినట్లు దోషులు ఎవరో తేల్చి శిక్షించాలి
- సోషల్ యాక్టివిస్టు గోపీచంద్ డిమాండ్

నరసరావుపేట: తన కూతురిపై జరిగిన దారుణ హత్యాచారానికి కారకులైన వారిని గుర్తించి కఠిన శిక్ష విధించాలనే ప్రీతి తల్లి ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకుని కేసును వెంటనే సీబీఐకి అప్పగించాలని సోషల్ యాక్టివిస్ట్ ఈదర గోపీచంద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ అంశంపై గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ చట్ట ప్రకారం బాధిత కుటుంబ సభ్యులకు పరిహారాలు ఇప్పించడమే కాక, సీబీఐ విచారణ కోరుతూ లేఖ కూడా రాసిందన్నారు. అయినప్పటికీ వాటిని ఇచ్చింది మేమేనని జనసేన నేతలు బుకాయించడం సిగ్గుచేటన్నారు. ఆ పార్టీ నాయకుడు గాదె వెంకటేశ్వరరావు ప్రీతి తల్లిదండ్రులు ఇద్దరినీ కించపరిచే మాటలతో దూషిస్తూ, తీసుకున్న పరిహారాన్ని తిరిగి ప్రభుత్వానికి ఇచ్చెయ్యమని హూంకరించడం హేయం, కిరాతకం, అమానుషమన్నారు. దీనిపై వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లైంగికదాడి చేసినవారిని ఎందుకు గుర్తించలేకపోయారో, ఎక్కడ లోపం జరిగిందో ఇప్పటికైనా సమగ్ర విచారణ సీబీఐతో చేయించాల్సిన బాధ్యత జనసేన కూటమి తీసుకోవాలని సూచించారు. మహిళా సంఘాలు ఈ అంశంపై ప్రీతి తల్లికి అండగా నిలవాలని గోపీచంద్ కోరారు.

అక్రమ కట్టడాలను తొలగిస్తాం

రాజుపాలెం: పూర్తి సర్వే చేసి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కట్టడాలను తొలగిస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గాయత్రి తెలిపారు. మండలకేంద్రంలోని రాజుపాలెం పులిచింతల నిర్వాసిత కేంద్రంలో వివాదాస్పదంగా మారిన స్థలాలను బుధవారం ఆమె పరిశీలించారు. తన స్థలాన్ని కొందరు అక్రమంగా ఆక్రమించి, తనపై దౌర్జన్యానికి దిగారంటూ గ్రామానికి చెందిన భూక్యా వెంకటేశ్వరనాయక్ స్థానిక పోలీసు స్టేషన్‌లోనూ, పీజీఆర్‌ఎస్‌లోనూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ స్థల పరిశీలనకు వచ్చారు. వెంకటేశ్వరనాయక్‌కు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

- నిర్వాసితులు కొంతమంది పాఠశాల ఎదురుగా ఉన్న 60 అడుగుల బజారులో శాశ్వత కట్టడాలు చేసి అద్దెలకు ఇస్తున్నారని, దీని వలన బజారు పూర్తిగా మూసుకపోయిందని, విద్యార్థులు చాల ఇబ్బందులు పడుతున్నారని తెలపడంతో 60 అడుగుల బజారులోని కట్టడాలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆరు గదులు నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. నిర్వాసిత కేంద్రంలో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ రాజుపాలెం పంచాయతీలో కలిసే విధంగా జిల్లా పంచాయతీ అధికారిని పరిశీలనకు పంపి చర్యలు చేపడతామని నిర్వాసితులకు హామీ ఇచ్చారు. ఆమె వెంట తహసీల్దార్ సరోజ, వీఆర్వో నాగలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

బాపట్ల డీఈఓ పురుషోత్తం



నూతన వస్త్రాలను అందిస్తున్న ఎన్‌ఆర్‌ఐ పద్మజ, డీఈఓ పురుషోత్తం

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొనే విద్యార్థులు అదృష్టవంతులని డీఈఓ ఎస్.పురుషోత్తం పేర్కొన్నారు. స్థానిక యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని, పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా కారంచేడులోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి గ్రామానికి చెందిన అనేక మంది ఎన్నారైలు, పాఠశాలల పూర్వ విద్యార్థులు చేతులు కలపడం మంచి పరిణామమని కొనియాడారు. గ్రామంలోని వైఎస్ ప్రభుత్వ పాఠశాలను దాతల సహకారంతో రూ. 12 లక్షలతో అభివృద్ధి చేశారని తెలిపారు. అమెరికాలోని డల్లాస్ పట్టణంలో స్థిరపడిన గ్రామానికి చెందిన రాయినీడి మురళీకృష్ణ సహకారంతో రూ. 33 లక్షలతో నూతనంగా బస్సును కొనుగోలు చేసి ప్రారంభించడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఉన్నత పాఠశాల వరకు ఉన్న 360 మంది విద్యార్థులకు రెండు జతల చొప్పున దుస్తులను గ్రామానికి చెందిన హైదరాబాద్‌లోని స్మైల్ ఫౌండేషన్ నిర్వాహకులు గౌర అనీల్‌కుమార్ సమకూర్చగా, వాటిని కూడా ఆయన చేతుల మీదుగా అందించారు. ఎన్నారై ఘంటా పద్మజ మాట్లాడుతూ తాను ఈ పాఠశాల పూర్వ విద్యార్థినేనని తెలిపారు. అవిభక్త పిల్లల వైద్యులు, గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేసుకున్న డాక్టర్ యార్లగడ్డ నాయుడమ్మ కూడా ఈ పాఠశాల విద్యార్థే అని గుర్తు చేశారు. వేసవి తరగతులు నిర్వహించిన పావులూరి శ్రీనివాసరావు, పాదిలి మురళీకృష్ణలను సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ యార్లగడ్డ రాఘవయ్య, చుండూరి రామయ్య, పాఠశాల పూర్వ కరస్పాండెంట్ యార్లగడ్డ రఘుబాబు, ఎంఈఓ ఎం. వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం సామ్రాజ్యం పాల్గొన్నారు.

టిష్యూ కల్చర్ అరటికి సబ్సిడీ



జువ్వలపాలెంలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ, ఉద్యాన వన శాఖాధికారులు

కొల్లూరు : టిష్యూ కల్చర్ అరటి సాగు చేసే రైతులకు ప్రభుత్వం నుంచి సబ్సిడీ లభిస్తుందని మండల ఉద్యాన శాఖాధికారి కల్యాణ చక్రవర్తి తెలిపారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సాగుకు ప్రాధాన్యమివ్వాలని ఆయన సూచించారు. మండలంలోని జువ్వలపాలెం, కిష్కింధపాలెం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ పంటలకు చీడ, పీడలు ఆశించకుండా అధికారుల సూచనల మేరకు మందులు వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. ఏఓ వి.నరేంద్రబాబు మాట్లాడుతూ సాగు చేసిన ప్రతి పంటను రైతు సేవా కేంద్రాల్లో ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి బి.ఎన్. వంశీ, వీహెచ్‌ఏ ఎం. నవీన్, వీఏఏలు కె. విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో వందేభారత్‌ను ఆపాలి



సౌత్ సెంట్రల్ రైల్వే జీఎంకు వినతిపత్రం అందజేసిన జెడ్‌ఆర్‌యూసీసీ మెంబర్ జూలకంటి

పిడుగురాళ్ల: వందే భారత్‌కు స్టాపింగ్ కల్పించాలంటూ జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టెంట్ కమిటీ మెంబర్ జూలకంటి శ్రీనివాసరావు విన్నవించారు. సికింద్రాబాద్‌లో బుధవారం జరిగిన సౌత్ సెంట్రల్ రైల్వే 75వ జెడ్‌ఆర్‌యూసీసీ మీటింగ్‌లో రైల్వే అధికారులకు విన్నవించినట్లు ఆయన తెలిపారు. పిడుగురాళ్ల స్టేషన్‌లో వందే భారత్, ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్, భావ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, రామేశ్వరం ఎక్స్‌ప్రెస్‌లు ఆగే లా చూడాలని కోరినట్లు పేర్కొన్నారు. నడికుడి – శ్రీకాళహస్తి నూతన రైలు మార్గంలో కొత్తగా రైళ్లు నడపాలని, పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కు ప్రయాణికుల రద్దీ ఎక్కుగా ఉందని బోగీల సంఖ్య పెంచాలని కోరానన్నారు. పిడుగురాళ్ల – నడికుడి రైల్వే స్టేషన్ల మధ్య గడిచిన నెలల్లో దోపిడీలు పలు మార్లు జరిగినందున ప్రయాణికులకు భద్రత పెంచాలని, రైల్వే పోలీసుచే రాత్రిళ్లు గస్తీ ఏర్పాటు చేయాలని సమావేశం దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీ వత్సవకు వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు.

కాలువలోకి దూకి వృద్ధురాలు ఆత్మహత్య



సురభి సీతమ్మ మృతదేహం

నకరికల్లు: మతిస్థిమితం సక్రమంగా లేక వృద్ధురాలు ఎన్‌ఎస్‌పీ కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ చల్లా సురేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. చీమలమర్రి గ్రామానికి చెందిన సురభి సీతమ్మ(75) గత కొన్నిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. ఈక్రమంలో బుధవారం సాయంత్రం సమయంలో చల్లగుండ్ల సమీపంలోని గోరంట్ల మేజర్‌లో దూకింది. సమీపంలోని వారు గమనించి వెలికితీసే సరికే మృతిచెందింది. ఘటనకు సంబంధించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి ఆరుగురు పిల్లలు ఉండగా, వారందరూ వివాహితులే.

14 బస్తాల యూరియా స్వాధీనం

దాచేపల్లి: అక్రమంగా తరలిస్తున్న 14 బస్తాల యూరియాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సౌందర్యరాజన్ బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక పోలీసులు మంగళవారం అర్ధరాత్రి పొందుగుల రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టామని, ఈ తనిఖీల్లో గురజాల మండలం గంగవరం గ్రామం నుంచి 14 యూరియా బస్తాలను రైతులు పేరుమీద కొనుగోలు చేసి తెలంగాణలోని దామరచర్ల మండలంలోకి ఆటో ద్వారా అక్రమంగా తరలిస్తున్న ముగ్గురిని గుర్తించి యూరియా బస్తాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. యూరియాను అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ సౌందర్యరాజన్ వెల్లడించారు.

సింగిల్ నంబర్ లాటరీ విక్రేతలు అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హనుమంతరావు, పక్కన సీఐలు ఎం.వి.చరణ్, ఎం.హైమారావు

నరసరావుపేట టౌన్: నిషేధిత సింగిల్ నంబర్ లాటరీ విక్రేతలు నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.51,480లు స్వాధీనం చేసుకున్నట్లు నరసరావుపేట ఇన్‌చార్జి డీఎస్పీ హనుమంతరావు తెలిపారు. బుధవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. చిత్రాలయ టాకీస్ సెంటర్‌లో సింగిల్ నంబర్ లాటరీ టిక్కెట్లు విక్రయిస్తున్నారన్నా సమాచారం మేరకు టూటౌన్ పోలీసులు దాడులు నిర్వహించి ఇస్లాంపేటకు చెందిన షేక్ మస్తాన్‌వలి, ఉప్పలపాడు గ్రామానికి చెందిన పరిమి వెంకటేశ్వర్లులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.6,580 నగదు, లాటరీ నంబర్లకు సంబంధించి స్లిప్‌లను స్వాధీనం చేసుకున్నారన్నారు. అదే విధంగా ఏంజెల్ టాకీస్ సమీపంలో వన్‌టౌన్ పోలీసులు దాడులు నిర్వహించి నిమ్మతోటకు చెందిన గుడిపాటి వెంకటేశ్వరరావు, ఇస్లాంపేటకు చెందిన షేక్ నన్నూ బాజీలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.44,900 నగదు, లాటరీ నంబర్ల స్లిప్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసులో పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులు ఇస్లాంపేటకు చెందిన షేక్ ఖాజాషరీఫ్ అలియాస్ బుజ్జి, రామిరెడ్డిపేటకు చెందిన షేక్ గౌస్‌పీరాలను అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. నిందితులను అరెస్ట్ చేయటంలో ప్రతిభ కనపరిచిన వన్‌టౌన్, టూటౌన్ సీఐలు ఎం.వి.చరణ్, ఎం.హైమారావు, ఎస్‌ఐలు టి.అశోక్ బాబు, అరుణలను అభినందించారు. నిషేధిత లాటరీ, మట్కా నిర్వాహకులపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

బడ్జెట్‌లలో చేనేతకు మొండిచేయి

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ

సత్తెనపల్లి: చేనేతకు బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేశాయని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిని ఫణిదం చేనేత సహకార సంఘం భవన ఆవరణలో బుధవారం జరిగిన చేనేత కార్మిక సంఘం పల్నాడు జిల్లా 3వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. మహాసభకు పల్నాడు జిల్లా అధ్యక్షుడు కట్టా శివ దుర్గారావు అధ్యక్షత వహించారు. బాలకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం 75 సంవత్సరాల కాలంలో ఎన్నడూ చేనేతకు ఇలాంటి పరిస్థితులు ఏర్పడలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పవర్లూమ్స్, జెట్లూమ్స్‌లను ప్రోత్సహిస్తూ చేనేత రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై అక్టోబర్ 6,7 తేదీలలో సత్తెనపల్లిలో జరిగే చేనేత కార్మిక సంఘం 11వ రాష్ట్ర మహాసభలలో చర్చించి కార్యచరణ ప్రణాళికను రూపొందించి భవిష్యత్తు పోరాటాలకు పిలుపునిస్తామని ఆయన హెచ్చరించారు. ముందుగా చేనేత జెండాను చేనేత జాతీయ అవార్డు గ్రహీత కర్నాటి మురళి, సామాజిక సేవా కార్యకర్త గంజి వీరాస్వామి, పణిదం చేనేత సొసైటీ కార్మికురాలు మంచి మల్లేశ్వరిలు ఆవిష్కరించారు. మహాసభలో సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల వీరబ్రహ్మం కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం నివేదికపై మహాసభలో ప్రతినిధులు చర్చించి నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. భవిష్యత్ కర్తవ్యాల కార్యచరణ ప్రణాళికను రూపొందించారు. మహాసభలో చేనేత కార్మిక సంఘ నాయకులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

చేనేత సహకార సంఘం జిల్లా అధ్యక్షుడిగా శివదుర్గారావు



కట్టా శివదుర్గారావు



అనుముల వీరబ్రహ్మం

సత్తెనపల్లి: ఏపీ చేనేత సహకార సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా సత్తెనపల్లికి చెందిన కట్టా శివ దుర్గారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ఫణిదం చేనేత సహకార సంఘం భవన్ ఆవరణలో బుధవారం జరిగిన ఏపీ చేనేత సహకార సంఘం పల్నాడు జిల్లా మూడో మహసభలో 10 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా అనుముల వీరబ్రహ్మం, కమిటీ సభ్యులుగా బిట్రా పానకాలు, పంతంగి ప్రభాకర్, గడ్డం సుసులోవ్, గనిక పూడి ఏసురత్నం, వలపర్ల దిబ్బయ్య, మోపపర్తి బాబు రాజు, మల్లాల గురవయ్య, సాముల నాగలక్ష్మిలను ఎన్నుకున్నారు.